క్లుప్తంగా

స్వీపర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

గీసుకొండ : మండలంలోని వంచనగిరి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో (కేజీబీవీ) కాంట్రాక్టు పద్ధతిలో 11 నెలలు పని చేయడానికి స్వీపర్ కం స్కావెంజర్–1 పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ చదువుల సత్యనారాయణ, మండల నోడల్ అధికారి రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 16వ తేదీలోగా కేజీబీవీలో స్వయంగా దరఖాస్తు పత్రం అందజేయాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ పి.హిమ బిందును సంప్రదించాలని కోరారు.

కరపత్రాల ఆవిష్కరణ



నర్సంపేట : రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే నెల 16వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే బొజ్జతారకం వర్ధంతి సభలను జయప్రదం చేయాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా బొజ్జ తారకం రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకేశ్వరపు రమేష్‌లు పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల పైడి అధ్యక్షతన ఆదివారం వర్ధంతి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి గునిగంటి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎడ్ల రవి, జిల్లా కార్యదర్శి తారల శంకర్, జిల్లా ప్రచార కార్యదర్శి ఎండి.షాహిదాబేగం, గుగులోత్ సోనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

పర్వతగిరి : మండలంలోని మూడెత్తుతండాలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో మారుమూల తండాలకు, హరిజన, గిరిజన వాడలకు మెరుగైన సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే నిధుల ద్వారా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

'హర్‌ఘర్ తిరంగా' వేడుకలు



ఖానాపురం : మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఆదివారం హర్‌ఘర్ తిరంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో స్వామి వివేకానంద విగ్రహాన్ని శుద్ధి చేసి నివాళులర్పించారు. దేశం కోసం చేసిన త్యాగాలను స్మరించుకుంటూ నేటి యువత స్వాతంత్ర్య సమరయోధులను ఆదర్శంగా తీసుకోని ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు మధు, రమేష్, యాకస్వామి, మల్లారెడ్డి, కుమారస్వామి, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

ఈత మొక్కల పంపిణీ

పర్వతగిరి : మండలంలోని పర్వతగిరి, కల్లెడ, బూర్గుమళ్ల గ్రామాల్లోని గౌడ సంఘం సభ్యులకు ఆదివారం వర్ధన్నపేట ఎక్సైజ్ సీఐ స్వరూప ఈత మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈత మొక్కలను నాటి గౌడ కులస్తులు వాటితో వచ్చే ఆదాయం ద్వారా ఆర్థికంగా రాణించాలని కోరారు.

పార్కింగ్ స్థలాలు లేక పరేషాన్



బస్టాండ్ ఎదుట నిలిపిన ఆటోలు



ప్రధాన రహదారిపై నిర్వహిస్తున్న సంత

- రోడ్లపైనే వాహనాల నిలిపివేత
- బస్టాండ్ ఎదుట ఇష్టారాజ్యంగా ఆటోలు

నర్సంపేట : నర్సంపేట మున్సిపాలిటీలో ప్రత్యేక పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలను నిలుపుతున్నారు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆరేళ్ల క్రితం మున్సిపల్‌గా ఏర్పడిన నాటి నుంచి పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో పట్టణవాసులు తమ వాహనాలు నిలిపేందుకు అవస్థలు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో దుకాణ సముదాయాల ఎదుట ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్‌కు స్థలాలు, షెడ్లు, తదితర నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

రద్దీగా ఉండే ప్రాంతాలు..

నర్సంపేట పట్టణంలోని వరంగల్ క్రాస్ రోడ్డు కూడలి, బస్టాండ్ ఎదుట ఏరియా, అంగడి సెంటర్, అంబేడ్కర్ సెంటర్, పాకాల సెంటర్, ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్ ఏరియా, వ్యవసాయ మార్కెట్ ఏరియాలలో నిత్యం రద్దీ అధికంగా ఉంటుంది. ఇక్కడ వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలను నిలుపుతున్నారు.దీంతో రాకపోకలకు ఆటంకం ఎదురవుతోంది.

నోటీసు ఇచ్చినా ఫలితం లేదు..

ప్రధాన రహదారికి ఇరువైపులా దుకాణ సముదాయాలు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకొని వ్యాపారం చేయడంతో పాటు తమ దుకాణాల ఎదుట వారి సొంత వాహనాలతో పాటు వినియోగదారుల వాహనాలను నిలుపుతుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిపై పలుమార్లు మున్సిపాలిటీ అధికారులు నోటీసులు ఇచ్చిన ఫలితం లేదు. అధికారులు కూడా కఠిన చర్యలకు పాల్పడకపోవడంతో సమస్యలు జఠిలమవుతున్నాయి.

ఇష్టానుసారంగా ఆటోల నిలిపివేత..

నర్సంపేట బస్టాండ్ ఎదుట ఆటోలను ఇష్టానుసారంగా నిలపడంతో ప్రయాణికుల రాకపోకలకు తిప్పలు తప్పడం లేదు. దీంతో బస్సు దిగిన ప్రయాణికులు బయటికి వెళ్లేందుకు దారి లేక ట్రాఫిక్ జామ్ అవుతుంది. వాహనాల రాకపోకలకు అడ్డుగా ఆటోలను నిలిపివేస్తుండడంతో పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. ఈ క్రమంలో ఆటో యజమానులకు, ప్రయాణికులకు పలుమార్లు ఘర్షణలు కూడా జరుగుతున్నాయి.

ప్రధాన రహదారిపై సంత..

నర్సంపేటలోని ప్రధాన రహదారిపై ప్రతీ ఆదివారం వారంతపు సంత జరుగుతుండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. సంత నిర్వహణకు వేరే చోట స్థలాన్ని కేటాయించినప్పటికీ చిరు వ్యాపారులు మాత్రం ప్రధాన రహదారిపైనే విక్రయాలు కొనసాగిస్తుండగా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీనికి తోడు పశువులు సైతం రోడ్లపై వస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలి

- ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు

వర్ధన్నపేట : కంటి సమస్యలు ఉన్న వారు, చూపు మందగించిన వారు ఉచిత కంటి వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం శంకర నేత్రాలయ కంటి వైద్యశాల, నాట్య జ్యోతి కూచిపూడి డ్యాన్స్ ఆధ్వర్యంలో ఉచితంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ శిబిరం 17వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మున్సిపల్ కార్మికురాలిని ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. నాయకులు మైస సురేష్, నిమ్మాని శేఖర్‌రావు, అంగోత్ అరుణ, మున్సిపల్ కమిషనర్ ఇ జోనా, వైద్యులు, సిబ్బంది, నాట్య జ్యోతి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా ఉంటాం..



సమావేశంలో మాట్లాడుతున్న మురళీధర్

నల్లబెల్లి : రైతు రుణమాఫీలో తలెత్తిన తప్పులను సరి చేసేందుకు ప్రభుత్వం నెల రోజుల గడువు ఇచ్చిందని, రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని, రైతులకు అండగా ఉంటామని పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 35 ఏళ్లకు సంబంధించిన పంట రుణాల మంజూరు రికార్డులు కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని, అభ్యంతరాలు ఉన్న రైతులు వచ్చి పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఏడాది లోపు పంట రుణాలు రెన్యూవల్ చేయకుంటే 14 శాతం వడ్డీ పడుతుందనే ఉద్దేశంతో పంట రుణాలు ప్రతి ఏడాది రెన్యూవల్ చేస్తున్నట్లు తెలిపారు. పంట రుణాల మాఫీ కోసం ఆధార్ కార్డులు ఆన్‌లైన్ చేసే క్రమంలో జరిగిన పొరపాట్లను సరి చేస్తున్నామన్నారు. కొందరు వ్యక్తులు రైతులకు తప్పుడు సమాచారాన్ని చేరవేస్తూ గత పది రోజులుగా అధికారులను ఇబ్బందికి గురి చేస్తున్నారని ఆరోపించారు. రైతులు తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దన్నారు. సంఘంలో ఎలాంటి అవినీతి, అక్రమాలు జరుగలేదని వివరించారు. సమావేశంలో డైరెక్టర్లు ముత్యాల సాంబయ్య, భూక్య దేవ్‌సింగ్, ఉప్పుల రవి, శ్రీపతి కొమురయ్య పాల్గొన్నారు.

14 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



నిందితుడిని చూపుతున్న ఎస్సై వెంకటేశ్వర్లు

దుగ్గొండి : మండలంలోని పొనకల్, మహ్మదాపురం గ్రామాల్లో అక్రమంగా తరలిస్తున్న 14 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆదివారం సాయంత్రం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పొనకల్ గ్రామానికి చెందిన లక్క నరేష్ టాటా ట్రాలీ వాహనంలో 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా నాచినపల్లి వద్ద ఎస్సై వెంకటేశ్వర్లు పట్టుకున్నారు. మహ్మదాపురం గ్రామంలో 4 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో కమ్మపల్లి గ్రామానికి చెందిన అల్లె మహేందర్ పట్టుబడ్డారు. ఇరువురి నుంచి 14 క్వింటాళ్ల రేషన్ బియ్యం, టాటా ట్రాలీ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. రూ.42 వేల విలువ గల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయీస్ అధికారులు అప్పగించామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

వైస్ చైర్మన్‌కు అభినందనలు



హరిబాబును సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖానాపురం : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు నర్సంపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఖానాపురం మండలంలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. ఉపేందర్, నర్సయ్య, చాంద్ పాషా, కొస్కటి రాజు, విజాకర్‌రావు రవీందర్, రాంరెడ్డి, సత్యనారాయణ, నర్సిరెడ్డి తదితరులు ఆయనను సన్మానించారు.

విజయ దండోరాను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రణయ్‌దీప్

నర్సంపేట : ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీం కోర్టు తీర్పుకు కృతజ్ఞతగా ఈనెల 12వ తేదీన నర్సంపేట పట్టణంలో ధర్మ విజయ దండోరా ప్రజా ప్రదర్శన ర్యాలీ, 13న చలో హైదరాబాద్ ర్యాలీ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్, మహాజన సోషలిస్టు పార్టీ నియోజకవర్గ కో కన్వీనర్ తడుగుల విజయ్‌లు కోరారు. ఈ మేరకు పట్టణంలోని తెలంగాణ అమరవీరుల జంక్షన్ వద్ద ఆదివారం ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్ధు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు 30ఏళ్లుగా సాగిన ఉద్యమానికి సుప్రీం కోర్టు తీర్పుతో సంపూర్ణ ఫలితం లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్, శ్రీకాంత్, రవి, శ్రీనివాస్, సుధాకర్, సంతోష్, నరేష్, వినోద్, వివేక్, తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీకి తరలిరావాలి

రాయపర్తి : మంద కృష్ణమాదిగ నేతృత్వంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న విజయోత్సవ ర్యాలీకి మాదిగలు, ఉపకులాల ప్రజలు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వశపాక కుమార్ మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం రాయపర్తి మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పునిచ్చిన సందర్భంగా ఈనెల 13న హైదరాబాద్‌లో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ విజయోత్సవ ర్యాలీలో పాల్గొనేందుకు మాదిగలు, ఉపకులాల ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీటీసీ ఐత రాంచందర్, ఐత అనిల్, పీరని ప్రవీణ్, ఐత రవి, పీరని దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత



ల్యాప్‌టాప్ ఇస్తున్న శ్రీనివాస్

వర్ధన్నపేట : వైద్యవిద్య అభ్యసిస్తున్న పేద విద్యార్థికి ఆత్మీయ ట్రస్ట్ సహకారంతో దాత ల్యాప్‌టాప్ అందజేశారు. మండలంలోని దమ్మన్నపేటకు చెందిన గడ్డం శృతి ఖమ్మం జిల్లాలోని మమత మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతోంది. చిన్నతనంలోనే తండ్రి మృతి చెందగా ఆమె తల్లి అన్ని తానై చదివిస్తోంది. కాగా పలువురు దాతలు శృతి చదువుకు అయ్యే ఖర్చును భరిస్తున్నారు. ఆత్మీయ ట్రస్ట్ నిజామాబాద్‌కు చెందిన ఇంజనీర్ కటకం శ్రీనివాస్‌ను సంప్రదించగా ఆయన ల్యాప్‌టాప్‌ను అందజేసి దాతృత్వం చాటుకున్నారు. శృతి, ఆమె తల్లి సుజాత కటకం రవీందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రాంరెడ్డికి సన్మానం



దుగ్గొండి : కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ఆర్.రాంరెడ్డిని మండల పీఈటీలు, కబడ్డీ అసోసియేషన్ బాధ్యులు ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. అనంతరం రాంరెడ్డి మాట్లాడారు. కబడ్డీని బతికించాల్సిన బాధ్యత పీఈటీలపై ఉందన్నారు. క్రికెట్ పేరుతో గ్రామీణ ఆటలపై కొంత ఆసక్తి తగ్గిందని మళ్లీ కబడ్డీ, రెజ్లింగ్‌కు ఆదరణ పెరిగిందన్నారు. కార్యక్రమంలో అబ్దుల్లాఖాన్, కక్కెర్ల మల్లికార్జున్, కబడ్డి పుప్పాల ఎల్లయ్య, పీఈటీలు దేవేందర్, కార్తీక్, వినోద్, రాజేందర్, పవన్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



రాయపర్తి : పరామర్శిస్తున్న దయాకర్‌రావు

రాయపర్తి : మండలంలోని మొరిపిరాల, మైలారం, పన్యా నాయక్ తండా, సన్నూరు గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబాలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదివారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, బిల్లా రాధికసుభాష్‌రెడ్డి, ఆకుల సురేందర్‌రావు, మండల ప్రధానకార్యదర్శి పూస మధు, చెవ్వు కాశీనాథం, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, నర్సయ్య, జగన్ నాయక్, చిన్నాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పెర్కవేడుకు చెందిన మేరుగు పద్మ ఇటీవల మృతిచెందగా చిన్నాల తారశ్రీ రాజబాబు పరామర్శించి, 50 కేజీల బియ్యం అందించారు.

పెద్ది పరామర్శ

నల్లబెల్లి : మండలంలోని రుద్రగూడెం బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు అబ్బు జయపాల్ రెడ్డి(48) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పరామర్శించారు. అనంతరం జయపాల్‌రెడ్డి మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఆ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, పీఏసీఎస్ అధ్యక్షుడు చెట్టుపల్లి మురళీధర్, కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, కోటిలింగాచారి, నాయకులు మోహన్ రెడ్డి, సూరయ్య, సాంబరెడ్డి, అమరేందర్, రాజిరెడ్డి, రాంచంద్రారెడ్డి, వినోద్, వినయ్, సదానందం, మహేష్ రెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ

చెన్నారావుపేట : మండలంలోని బోడ మాణిక్యం తండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు భూక్య మోహన్ నాయక్, నర్సు నాయక్ డెంగీ జ్వరంతో బాధపడుతుండగా భూక్య గోపాల్ నాయక్ ఆదివారం పరామర్శించారు.

ఎంపీని కలిసిన నాయకులు

రాయపర్తి : మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు భూక్యా సమ్మయ్య నాయక్ తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకుడు దేదావత్ రామ పాల్గొన్నారు.

కట్టమైసమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠ



మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

వర్ధన్నపేట : కోనారెడ్డి చెరువు కట్టపై గల కట్టమైసమ్మ ఆలయాన్ని పునఃనిర్మించడంతో పాటు అమ్మవారి విగ్రహాన్ని ఆదివారం పునఃప్రతిష్ఠించారు. ఈమేరకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు, స్థానికులు, రైతులు తమ ఇంటి వద్ద నుంచి తీసుకువచ్చిన నీళ్లతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు.

కొవ్వొత్తులతో నివాళి

చెన్నారావుపేట : జర్నలిస్ట్ యోగిరెడ్డి, అతని కూతురు అద్యరెడ్డి మృతికి సంతాపంగా స్థానిక జర్నలిస్టులు నివాళులర్పించారు. ఆదివారం మండల కేంద్రంలో యోగిరెడ్డి, ఆద్యరెడ్డిల చిత్రపటం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. అలాగే రెండు నిమిషాలు మౌనం పాటించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. తండ్రి, కూతురు ఇద్దరు ఆత్మహత్య చేసుకొని మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన జర్నలిస్టు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. జర్నలిస్టులు మహమ్మద్ అబ్దుల్ వహీద్, పడిదం శోభన్, ఆకుల అశోక్, సుమన్, కాసుల రామ్మోహన్ చారి, గుగులోత్ నరసింహ, ముత్యం రాజు, కుండె కరుణాకర్, కొండపర్తి చంద్రమోహన్, శంకేసి రంజిత్, గుగులోత్ రాజు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గీసుకొండ: సమ్మేళనంలో పాల్గొన్న 1990-91 బ్యాచ్ విద్యార్థులు



నర్సంపేట : ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 2002-03 బ్యాచ్ విద్యార్థులు

గీసుకొండ : మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1990–91లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి హెచ్‌ఎం ఇరుకుళ్ల వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు సయ్యద్ అలీ అక్బర్, కందుకూరి దేవేంద్రాచారి, కొవ్వూరుల రమణాచారి, రాపెల్లి నర్సింహస్వామి, తాడ మోహన్‌రెడ్డిలను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. తమను ఉన్నతులుగా తీర్చిదిద్దిన గురువుల బోధనను గుర్తు చేసుకున్నారు. తమ జీవిత అనుభవాలను ఒకరినొకరు పంచుకున్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ముత్తినేని రాధాకృష్ణ సమన్వయ కర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ప్రస్తుత హెచ్‌ఎం మిడిపెల్లి పట్టాభి పాల్గొన్నారు. విద్యార్థి మిత్రులకు ఆపద వస్తే అందరూ కలిసి ఆదుకోవాలని తీర్మానించారు.

నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని ఉదయశ్రీ పాఠశాలలో 2002–03 సంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాత అనుభవాలను గుర్తు చేసుకుని ఒకరినొకరు పలకరించుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ నిమ్మాని జగదీశ్వర్‌రావు, ఉపాధ్యాయులు కూచన రమేష్, గోరంటాల మహేందర్, కంటి శంకర్‌బాబును పూర్వ విద్యార్థులు సన్మానించారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు



బోనాలతో వెళ్తున్న భక్తులు



సంగెం: ఎల్గూర్‌రంగంపేటలో..



గీసుకొండలో బోనాలతో వెళ్తున్న మహిళలు



ఖానాపురం: మొక్కులు చెల్లిస్తున్న ప్రజలు



చెన్నారావుపేట: బోనాలతో వెళ్తున్న మహిళలు

గీసుకొండ : శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం పోచమ్మ తల్లి బోనాల పండుగను మండల కేంద్రంలో జరుపుకున్నారు. అధిక సంఖ్యలో మహిళలు భక్తిశ్రద్ధలతో పోచమ్మ తల్లి గుడికి చేరుకుని బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లాపాపలను చల్లంగ చూడాలని, వ్యాధులు రాకుండా చూడాలని అమ్మవారికి మొక్కుకున్నారు.

ఘనంగా బోనాల పండుగ

సంగెం : తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగను మండలంలోని ఆశాలపల్లి, ఎల్గూర్‌రంగంపేట తదితర గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవత పోచమ్మతల్లికి మొక్కులు చెల్లించారు.

ఉప్పరపల్లిలో..


చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో ఆదివారం పోచమ్మ తల్లి బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. డప్పుచప్పుళ్లతో మహిళలు బోనాలతో పోచమ్మతల్లి దేవాలయాలకు తరలివెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండల కేంద్రంలోని ఆయా గ్రామాల్లో ఆది వారం పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. స్థానికులు పోచమ్మతల్లి వద్దకు బోనాలతో వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

పోచమ్మ తల్లి బోనాలు

పర్వతగిరి : శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం పోచమ్మ బోనాలను మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. మండలంలోని ఏనుగల్ గ్రామంలో బీజేపీ నాయకులు గూడ నరేందర్‌వర్మ, తొర్రి లక్ష్మణ్‌యాదవ్‌లు పోచమ్మ తల్లిని దర్శించుకున్నారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా రాజు



ఖానాపురం : యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా రాగంపేట గ్రామానికి చెందిన ఎలగందుల రాజు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు రాజును యూత్ కాంగ్రెస్ మండల నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అన్ని వర్గాల ప్రజలకు చేరే విధంగా కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీని మరింతగా బలోపేతం చేసుకోవడానికి యూత్ నాయకులు ముందుండాలన్నారు. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే మాధవరెడ్డికి, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు మోడెం ఎల్లగౌడ్, మొలకల మురళీ, పల్స ప్రశాంత్, రాజు, మనీష్, హరీష్, వినయ్, మల్సూర్ ఉన్నారు.